94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21



త్వరలో మీముందుకు రానున్న
'ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల కాంటాక్ట్ బుక్‌లెట్'
రాజధాని వార్తలు ప్రత్యేక సంచిక ఫోన్ : 9440662699

# రాజధాని వార్తలు
RAJADHANI VARTALU

కేవలం 1000 రూపాయలకే



విజయవాడ బందర్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో ఏసి మీటింగ్ హాలు ఏర్పాటు చేయడం జరిగింది. కేవలం 1000 రూపాయలకే ఇందులో 50 మందితో సమావేశాలు జరుపుకోవచ్చును. ఫోన్: 94406 62699

అమరావతి సంపుటి : 4 సంచిక : 44, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 5 - ఆదివారం 11 ఆగస్టు, 2019
Amaravati Volume : 4 Issue : 44, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY Monday 5 - Sunday 11 August, 2019

వివరాలు2లో...

1.39 లక్షల కార్డుల ఏరివేత!

వివరాలు3లో...

సెప్టెంబర్ 8న కూడా సచివాలయాల పరీక్ష

వివరాలు4లో...

కాఫీ ఘుమ..ఘుమల సిద్ధార్థ అంతర్థానం

వివరాలు4లో...

అమర్‌నాథ్ యాత్ర అర్ధంతరంగా నిలిపివేత

## రాష్ట్రంలో విదేశీ పెట్టుబడుల సదస్సు

**ఈ నెల 9న దౌత్యవేత్తలతో చర్చలు.. కేంద్రం ఆధ్వర్యంలో.. బెజవాడలో నిర్వహణ**



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆగష్టు 9న విదేశీ పెట్టుబడుల సదస్సును నిర్వహించనున్నారు. పూర్తిగా కేంద్ర విదేశాంగ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు విజయవాడలోని ఓ హోటల్‌లో జరగనుంది. ఈ సదస్సుకు మొత్తం 26 దేశాల నుంచి దౌత్యవేత్తలు, రాయబారులు హాజరుకానున్నారు. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై విదేశీ సంస్థలతో సదస్సును నిర్వహించడంలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ భాగస్వామ్యం వహిస్తోంది. ఏపీలో పెట్టుబడులు పెట్టే అవకాశంపై చర్చించేందుకు 30 నుంచి 40 దేశాలను విదేశాంగ శాఖ ఆహ్వానించింది. ఈ ఆహ్వానానికి 26 దేశాలు స్పందించి, హాజరవుతామంటూ వర్తమానం పంపాయి. ఆయా దేశాలకు చెందిన రాయబారులు, దౌత్యవేత్తలు విజయవాడకి రానుండడంతో.. దేశ విదేశీ ప్రముఖ పారిశ్రామిక సంస్థలన్నీ ఏపీపై దృష్టి సారించాయి. సీఎంగా జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక.. కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖ చొరవతో పెట్టుబడుల సదస్సు జరుగుతుండడంతో. దిగ్గజ పారిశ్రామిక వేత్తలు ఆసక్తిగా గమనిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలను ఆహ్వానిస్తూనే.. ప్రభుత్వం రాయితీలు పొందిన పరిశ్రమల్లో తప్పని సరిగా 75% ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై కూడా ప్రధానంగా చర్చించనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రానికి ఆదాయ వనరులు అన్వేషణ ఈ సదస్సుతోనే ఆరంభమవటము సంతోషంగా ఉందని పలువురు పారిశ్రామికవేత్తలు చెప్తున్నారు. అయితే పరిశ్రమలను ఎంత త్వరలో ఆకర్షించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిస్తారా అని ప్రజలు వాపోతున్నారు. ఉద్యోగార్థులు కూడా ఎంతో ఆశతో ఉన్నారని తెలుస్తుంది.

# పరిశ్రమలకు స్వర్గధామం ఏపీ

- లంచాలకు తావు లేకుండా పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సెమినార్‌లో మంత్రులు, ఏపీఐఐసీ చైర్‌పర్సన్




**రాజధాని వార్తలు, అమరావతి :** 'పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం. లంచాలకు తావు లేకుండా పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తాం. పెట్టుబడులతో ముందుకొస్తే అవసరమైన అనుమతులను వెంటనే ఇస్తాం' అని రాష్ట్ర మంత్రులు, ఏపీఐఐసీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే అంశంపై చిత్తూరు జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ.. పారిశ్రామిక చట్టం సవరణలో భాగంగా మరికొన్ని సంబంధిత శాఖలను సింగిల్ డెస్క్ పోర్టల్లోకి తీసుకొస్తామన్నారు. ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. సామాజిక బాధ్యతతో పారిశ్రామిక రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామని వివరించారు. పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసం తగ్గించేందుకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై పూర్తిస్థాయి దృష్టి సారిస్తున్నామన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా త్వరితగతిన పారిశ్రామిక అనుమతులు మంజూరు చేయడంతో పాటు వారికి అవగాహన కల్పించేందుకు ప్రతినెలా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఏపీఐఐసీ కింద జిల్లాలో నాలుగువేల ఎకరాల భూమి ఉందని, వచ్చే ఏడాది కల్లా పరిశ్రమల పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తయ్యేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఏపీఐఐసీ చైర్‌పర్సన్ ఆర్.కె.రోజా అధికారులకు సూచించారు. చెన్నై పోర్టు, కృష్ణపట్నం పోర్టు, చెన్నై ఎయిర్‌పోర్టు జిల్లాకు సమీపంలో ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వీలైనన్ని పరిశ్రమలు స్థాపిస్తే ఉద్యోగాల విప్లవం తీసుకురావచ్చన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి రజిత్ భార్గవ్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఏఏ పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉందో ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదిమూలం, వెంకటేగౌడ, శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. విద్యుత్ బిల్లులు తగ్గించి, పరిశ్రమలకు మేలు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కగా ప్రయత్నిస్తున్నారని పలువురు పారిశ్రామికవేత్తలు కొనియాడారు.

## అందుకే ఆ చానల్స్‌కు నోటీసులు : స్పీకర్



**రాజధాని వార్తలు, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అద్భుతమైన బిల్లులపై చర్చ జరిగిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సభా నిబంధనల విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ నియమావళికి విరుద్ధంగా ప్రసారాలు నిర్వహించినందుకే ఆ మూడు చానల్స్‌కు నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు. రూల్స్ తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. నిద్రపోయేవారిని లేపవచ్చు కానీ.. నిద్రపోయినట్టు నటించే వాళ్లను ఏమి చేయలేమని వ్యాఖ్యానించారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని బిల్లులపై పూర్తి స్థాయిలో చర్చ జరగాలని పీఏసీలో చెప్పారు. బిల్లులపై పూర్తి స్థాయి చర్చ జరిగినప్పుడే అందులో ఏముందనేది అందరికీ అర్థమవుతుందనే సీఎం వైఎస్ జగన్ అభిప్రాయం. అవసరమైతే అసెంబ్లీ సమావేశాలు మరో మూడు నాలుగు రోజులు పొడిగిద్దామని కూడా సీఎం వైఎస్ జగన్ చెప్పారు. నాపై ఎటువంటి ఒత్తిళ్లు లేవు. స్పీకర్‌పై తమవైపు నుంచి ఎటువంటి ఒత్తిళ్లు ఉండవని సీఎం వైఎస్ జగన్ ముందే చెప్పారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తాను. పార్టీ విలీన వ్యవహారాల్లో నేను అసలు రాజీ పడను. చట్టం ప్రకారం అది నేరం.. నిబంధనలకు విరుద్ధంగా నేను నడుచుకోన'ని తెలిపారు.

## ముస్లింలకు అండగా వైఎస్సార్‌సీపీ - ఎంపీ విజయసాయిరెడ్డి



**ఒత్తిడి ఉన్నా ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించాం**

విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముస్లింల ప్రయోజనాలను కాపాడుతుందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయి రెడ్డి చెప్పారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసాలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో విజయసాయిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులంతా వైఎస్సార్‌సీపీని బలపరిచి అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. పార్టీ తరఫున ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక ఎమ్మెల్సీని ముస్లింలకు కేటాయిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారరని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకించాం**

ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు మన వైఖరి ఏంటని సార్ అని అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని సంప్రదించగా ముస్లిం ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారని వెల్లడించారు. ముస్లింలంతా ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకిస్తున్నారని.. మనం కూడా వారి ప్రయోజనాలను కాపాడాలంటే బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని సూచించి ముస్లింలపై ఆయనకున్న అభిమానాన్ని చాటుకున్నారని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఆమోదం తెలపాలని కొన్ని రాజకీయపార్టీల ఒత్తిడి ఉన్నప్పటికీ వ్యతిరేకంగా పార్లమెంట్‌లో పోరాడాలని జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. ముస్లింల ప్రయోజనాలను కాపాడేది వైఎస్సార్‌సీపీ మాత్రమే అని చెప్పారు. విశాఖవాసిగా మీ అందరితో కలసి మెలసి ఉండాలనే ఆకాంక్ష ఉందని ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి ముస్లింల కోసం చేపట్టని అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగాయన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి కృషిచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

## రికార్డులు తిరగరాస్తున్న శ్రీవారి హుండీ ఆదాయం



**రాజధాని వార్తలు, తిరుపతి :** నవంబరు నెలకి సంబంధించి టీటీటీ... తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను రిలీజ్ చేసింది. 69వేల 254 టికెట్లను రిలీజ్ చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ టికెట్లు కావాలనుకునే భక్తులు... www.tirumala.org వెబ్‌సైట్ ద్వారా ఉదయం 10 గంటల నుంచి పొందవచ్చు. ఎలక్ట్రానిక్ లాటరీ విధానం ద్వారా టీటీడీ... 10,904 సేవా టికెట్లను రిలీజ్ చేసింది. సుప్రభాతం 7, 549, అర్చన 120, తోమాల 120, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం కోరుకునేవారి కోసం 2వేల 875 టికెట్లను అందుబాటులో ఉంచింది. కరెంటు బుకింగ్ కింద కూడా టీటీడీ అధికారులు.... 58వేల 350 ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేశారు. వాటిలో విశేష పూజ కోసం 15వందల టికెట్లు, కల్యాణోత్సవం కోసం 13వేల 300 టికెట్లు, ఊంజల్ సేవ కోసం 4వేల 200 టికెట్లు, ఆర్జిత బ్రహ్మోత్సవం కోసం 7వేల 700 టికెట్లు, వసంతోత్సవం కోసం 14వేల 850 కోట్లు, సహస్ర దీపాలంకరణ కోసం 16వేల 800 టికెట్లు విడుదల చేసింది.



షేక్ బడేమియా

మీ హజ్ యాత్ర విజయవంతంగా కొనసాగించాలని కోరుకుంటూ...
కుటుంబ సభ్యులు, మిత్రులు మరియు బంధువులు
రాయపూడి, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా

**'గుణ 369' మూవీ రివ్యూ 3లో**

## నిష్పక్షపాతంగా సేవలు అందిస్తాం

**తుళ్ళూరు డీఎస్పీ గా వై. శ్రీనివాస రెడ్డి.**



**రాజధాని వార్తలు, తుళ్ళూరు :** తుళ్ళూరు డీఎస్పీ గా వై. శ్రీనివాస రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు జిల్లా ట్రైనింగ్ కాలేజిలో పని చేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో తుళ్ళూరుకు వచ్చారు. అనంతరం ఆయనను సబ్ డివిజన్ లోని సీఐలు, ఎస్సైలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నిస్పక్షపాతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని, న్యాయం చేయమని పోలీసు గడప ఎక్కిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తుళ్ళూరు సబ్ డివిజన్ లో పోలీసు సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలు, పోలీసుల మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగేలా తన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో రికార్డింగ్ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని సేవలు అందిస్తామన్నారు. నేర నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు చేపడతామన్నారు. పోలీసు సేవల్లో జాప్యం కూడదన్నారు. ప్రతి ఒక్కరికీ పోలీసు సేవలు నిష్పక్షపాతంగా అందాలన్నారు. ఆ దిశగా పోలీసు అధికారుల పని తీరు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుళ్ళూరు సీఐ విజయ్ కృష్ణ, ఎస్సైలు కిరణ్, వెంకట ప్రసాద్, కోటేశ్వరరావు, రవి శంకర్ రెడ్డి, ఉమెన్ ఎస్సై గౌతమి, తుళ్ళూరు సబ్ డివిజన్ లోని పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఏపీలో భారీ వర్షాలు



**రాజధాని వార్తలు, అమరావతి :** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోన్న ఉపరితల ఆవర్తనం అల్పపీడనం ప్రభావంతో ఆగస్టు 5 నుంచి 8 వరకు ఏపీలో భారీ వర్షాలు పడనున్నాయి. ఉత్తర కోస్తాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా మారి కోస్తాలో అనేకచోట్ల వర్షాలు కురిశాయి. చింతూరు, దెందులూరు, పెదవేగిలో 8 సెంటీ మీటర్లు, ఏలూరు, రాజమండ్రి, కూనవరంలో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆవర్తనంకి తోడు రుతుపవనాలు చురుగ్గా ఉన్నందున కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. దీంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా థాయ్‌లాండ్ పరిసరాల్లో వున్న అల్పపీడనం ఆగస్టు 4 న తూర్పు మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించనుంది. ఇది మరింత బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో మధ్యభారతం దానికి ఆనుకుని ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని విశాఖ ఐఎండీ కేంద్ర డైరెక్టర్ వైకే రెడ్డి పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాలకు వాతావరణం అనుకూలంగా ఉందని, ఆగస్టులో సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఆయన తెలిపారు. ఏపీ, తెలంగాణకు జీవధారమైన కృష్ణ, గోదావరి నదుల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర ఒడిశా మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది ఛత్తీస్‌గఢ్‌ను ఆనుకుని ఉన్న తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అల్పపీడన ప్రభావంతో ఆగస్టు 5 నుంచి 8 వరకు ఏపీ, ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపారు. కోస్తా కొంధమమాల్, బౌద్ ప్రాంతాల్లో 7 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదవుతుందని, మయూర్‌భంజ్, కెంఝూర్, ఢెంకనాల్, బాలాసోర్, పూరి, జగత్సింగ్‌పూర్ సహా పలు జిల్లాల్లో ఆగస్టు 8న ఐదు నుంచి ఏడు సెం.మీ. వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.

## అమిత్ షాతో వైవీ సుబ్బారెడ్డి భేటీ



**న్యూఢిల్లీ :** టీటీడీ చైర్మన్ హోదాలో సుబ్బారెడ్డి తొలిసారి ఢిల్లీలో కేంద్ర హోం శాఖమంత్రి అమిత్ షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో వైసీపీ నేత, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భేటీ అయ్యారు. టీటీడీ చైర్మన్ అయిన తర్వాత ఆయన వరుసగా ఢిల్లీ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలో నిన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. ఇవాళ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. రాష్ట్రానికి ఇతోధికంగా నిధులిచ్చి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ చైర్మన్ హోదాలో సుబ్బారెడ్డి తొలిసారి ఢిల్లీలో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందించారు. విభజన హామీలను పూర్తిగా నెరవేర్చాలని విన్నవించారు.

# రాజధాని వార్తలు కలం

## పరిశ్రమలు-ఉపాధి-స్థానికత

రాష్ట్రంలో పరిశ్రమలు, ప్రాజెక్టుల స్థాపన, స్థానిక యువతకు ఉపాధి కల్పన అంశాలపై విస్తృత చర్చ సాగుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో, వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు చేస్తారనే ఆశ నిరుద్యోగ యువతలో,వారి కుటుంబ సభుల్లో మెండుగా వుంది. స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే బిల్లు ఆమోదించడంతో ఆటు పారిశ్రామికవేత్తల్లోనూ చర్చ సాగుతోంది. అలాగే అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసేలా పిపిఎలు కుదుర్చుకున్నారని, అందువల్ల ప్రజలపైన, రాష్ట్ర ఖజానాపైన భారం పడింది, కనుక వాటిని సమీక్షించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపైనా పెద్ద దుమారమే లేచింది. ప్రైవేటు పవన,సౌర ఉత్పత్తి కంపెనీలు, కేంద్ర ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ కూడా పిపిఎల సమీక్ష కుదరదంటున్నాయి. హైకోర్టు స్టే ఇవ్వడంతో ప్రస్తుతం సద్దు మణిగినా అదీ చర్చనీయాంశంగానే వుంది. వివిధ పత్రికలు టివి చానెళ్లలో రకరకాల కథనాలు వస్తున్నాయి. అయితే, రెండు ఇంగ్లీషు పత్రికల్లో వచ్చిన కథనాలు ఆసక్తికరంగా వున్నాయి. ఇండియాను తన పేరులో చివరికి పెట్టుకున్న పత్రిక రాష్ట్రంలోని పరిస్థితి, గత ఐదేళ్ల ఉపాధి కల్పన సంగతులు పేర్కొంటే, ఇండియన్ అని పేరులో మొదటే పెట్టుకున్న మరో పత్రికయితే ఏకంగా ప్రభుత్వ చర్యల మూలంగా పారిశ్రామికవేత్తలు వెనక్కుపోయే ప్రమాదం వుందని భయ పెట్టింది.

గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలతో వందలాది పరిశ్రమలు వస్తాయని, సుమారు 50 లక్షల ఉద్యోగాలు కల్పించబడతాయనీ ఆయా సందర్భాల్లో సిఎం మొదలు మంత్రులూ అధికార ప్రతినిధులూ చెప్పారు. స్థానికులకు ఉద్యోగాలివ్వాలని షరతేమీ పెట్టలేదు. కానీ రాష్ట్రానికి కేవలం వేళ్లమీద లెక్కించదగిన సంఖ్యలోనే పరిశ్రమలు వచ్చిన విషయం ఆందరికీ తెలిసిందే! ఈ అంశాలను తేదీలవారీగా ఒక పత్రిక పేర్కొంది. స్థానికులకు కోటా ఇవ్వాలా వద్దా అన్నదాన్నిబట్టి కాకుండా చౌకగా ముడి సరుకు, శ్రమశక్తిదొరికి, ఎక్కువ లాభాలు వస్తాయంటేనే ప్రైవేటు పెట్టుబడిదార్లు పరిశ్రమల్లోనూ ఉద్యోగాలు చిన్నవైనా పెద్దవైనా ఎక్కువగా ఇతర రాష్ట్రాలవారినే నియమిస్తున్నారు. మరీ అత్యంత నిపుణులు తగినంతమంది దొరకకపోయినా ఆంధ్రప్రదేశలో నిపుణత కలిగినవారు (స్కిల్డ్), సెమి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వారికి ఎలాంటి కొదువా లేదు. ఆ మాటకొస్తే మెరికల్లాంటివారెందరో అమెరికా, ఐరోపా ఖండాల్లో ఉన్నత స్థానాల్లో మనవారున్నారు. కాబట్టి పరిశ్రమల్లో పని చేయడానికి స్థానికులు దొరకకపోవడం అన్నమాటే అసంబద్ధం. వలస కార్మికులు, ఉద్యోగులూ అయితేనే చౌకగా, నిర్బంధంగా పని చేయించుకోవచ్చుననే యజమానులు అలా వ్యవహరిస్తున్నారు కాబట్టి స్థానికుల కోటాసు వ్యతిరేకించడం పారిశ్రామికవేత్తల కొమ్ము కాయడమే! స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ బిల్లు ఇంకాచట్టంగా మారనేలేదు. దాని ఆమలుకు రూల్స్ ఇంకా రూపొందించనేలేదు అయినా పారిశ్రామికవేత్తలు వారికి వత్తాసుగా మీడియా ముందుగానే శాపనార్థాలు పెట్టడంతగని పని. పరిశ్రమ రావడానికి ముందే ఆ యాజమాన్యానికి తగిన ప్రణాళికవుంటే ఆ పరిశ్రమకు అవసరమైన నైపుణ్య శిక్షణ స్థానికులకు ఇప్పించవచ్చు. ప్రత్యేకమైన వాటికి ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆయా కోర్సులను ప్రారంభించవచ్చు. బిల్లులో అందుకు తగిన ప్రాతిపదికనూ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం. ప్రైవేటు వారు సమన్వయంతో అటువంటి నైపుణ్య శిక్షణ ఇప్పించవచ్చు. విశాఖ ఉక్కు ఆంధ్రులహక్కుగా సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌లో ఈ రాష్ట్రం వారికి, ముఖ్యంగా భూములు కోల్పోయినవారికీ ఉద్యోగాలొచ్చాయి. అందుకోసం కొత్తగా ఐటిఐలు, పాలిటెక్నిక్ కాలేజిలూ స్థాపించారు కూడా మరి అంత భారీ పరిశ్రమకు దాదాపు నాలుగు దశాబ్దాల కిందటే నైపుణ్యం కలిగిన స్థానికులు లభిస్తే ఈ రోజుల్లో దొరకరా? కాని ఆసలు కారణం అది కాదు వలస కార్మికులను ఉద్యోగులనూ దోచుకోవాలన్న పారిశ్రామికవేత్తం లాభాపేక్షే మూలం. అందుకనే అటు విశాఖలోని గంగవరం పోర్టు మొదలు కృష్ణపట్నం వరకు అన్నిటా చిరుద్యోగులూ ఆన్‌స్కిల్డ్ కార్మికులు స్తైతం స్థానికేతరులే! ఫార్మాసిటీ నుండి శ్రీసిటీ, ఇటీవలి కియాపరిశ్రమ వరకూ ఇదే తంతు నడుస్తోంది. ఈ విధానం మారాలి. ఆ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమినిచ్చి, తమ జీవనోపాధిని కోల్పోవడమేగాక పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం బారిన పడుతున్న స్థానికులు అక్కడ ఉపాధి పొందడానికి అర్హులు కారా? డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ వంటి అనేక సంఘాలు పరిశ్రమలు వచ్చేచోట ప్రజలు స్థానికులకు ఉపాధికై చాలా ఏళ్లుగా పోరాటం చేస్తున్నది న్యాయమైన డిమాండే. ప్రతిక ఏంచెప్పినా ప్రభుత్వం తానిచ్చిన మాట నిలబెట్టుకోవాలి. స్థానికులకు75 శాతం కోటా చట్టానికి పకడ్బందీగా రూల్స్ రూపొందించాలి. ఇక రాష్ట్రానికే రూ.వేలకోట్లు నష్టం వాటిల్లినా పర్వాలేదు కాని పిపిఎలసు పునస్సమీక్ష చేయరాదన్న వాదనను కేంద్రమే నేరుగా చేస్తోంది. దీనినే ఆ ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో ప్రతిధ్వనించాయి. రాష్ట్రం పునస్సమీక్షకు పూనుకుంటే పెట్టుబడులు వెనక్కిపోతాయని బెదిరిస్తున్నారు. రాష్ట్రం వేలకోట్లు నష్టపోయినా పర్వాలేదు కాని కార్పొరేట్లు మాత్రం నష్టపోకూడదన్నదే వీరి వైఖరి, ఎంత గొప్పన్యాయం! ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి ఆధికారం లేదు. కార్పొరేట్లదే అసలైన అధికారం అని స్పష్టం కావడం లేదా?

## అమెరికాలో పాప్ కార్న్ తింటూ...

**రాజధాని వార్తలు, మిన్నోటా :** టీడీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమెరికా వీధుల్లో పాప్‌కార్న్ తింటూ సందడి చేశారు వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్లిన చంద్రబాబు మిన్నెసోట రాష్ట్రంలోని మేయో క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేయించు కున్నారు. అమెరికాలోని తెలుగు సంఘాల ప్రతినిధులు జయరామ్ కోమటి, సతీశ్ వేమన, రామ్ చౌదరి కొందరు ఎన్నారైలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకోగా, వారితో కలిసి నడుస్తూ అమెరికా వీధుల్లో సందడి చేశారు చంద్రబాబు. అంతేకాదు తన భార్య భువనేశ్వరితో కలిసి అమెరికాలోని ఓ రెస్టారెంట్‌లో ఆయన భోజనం చేస్తున్న ఫొటో గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. వారు భోజనం చేస్తుండగా ఎవరో ఫొటో తీసి దానిని సోషల్ మీడియాలో పెట్టారు. ఈ ఫొటో చూసిన తెలుగు తమ్ముళ్లంతా ఆనందపడిపోతున్నారు. ఇన్నాళ్లకు కుటుంబంతో కలిసి గడిపే సమయం తమ అధినేతకు వచ్చిందంటూ కామెంట్లు పెడుతున్నారు.



## సెప్టెంబర్ 1 నుంచి ప్రతి పేదవాడికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తాం: కొడాలి నాని



**రాజధాని వార్తలు, అమరావతి :** సెప్టెంబర్ 1 నుంచి ప్రతి పేదవాడికి నాణ్యమైన సన్న బియ్యం అందిస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ చేసే పథకాన్ని తొలి విడతగా శ్రీకాకుళం నుంచి ప్రారంభిస్తామని వెల్లడించారు. బియ్యం పంపిణీలో అవినీతి లేకుండా పేదలకు సరఫరా చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి రాష్ట్రం మొత్తం సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు. అవినీతికి, రీసైక్లింగ్ కు తావు లేకుండా చేసేందుకే ప్యాక్ చేసిన బియ్యం ఇవ్వబోతున్నామని అన్నారు. ప్యాకింగ్ కు రూ.250 కోట్లు ఖర్చు పెడుతున్నామని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారని, రూ.12 వేల కోట్ల విలువ చేసే బియ్యం పంపిణీ చేసినప్పుడు ప్యాకింగ్ నిమిత్తం ఇంత డబ్బు ఖర్చు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గురించి ప్రస్తావిస్తూ, అక్టోబర్ 2 నుంచి చేపడతామని అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా కొత్త కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు.

## విజయవాడ రియల్టీకి

# మంచి రోజులెప్పుడో..?

- డిమాండ్ లేక డెవలపర్లు బెంబేలు..
- మందగమనం ఇప్పట్లో తగ్గదన్న భయాలు..
- డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ల రద్దుకే ప్రాధాన్యం



**గత కొంత కాలంగా విజయవాడ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం కుంగిపోతుంది. ఒకప్పుడు ఆపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లు హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోయాయి. అవే ప్రాంతాల్లో ఇప్పుడు ప్రాజెక్టులు కొనుగోలుదారులు, పందర్శకులు లేక వెలవెలబోతున్నాయి. మళ్లీ విజయవాడ రియల్టీకి మంచి రోజులెప్పుడో అన్న భావనతో డెవలపర్లు, బిల్డర్లు చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. కొందరైతే డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు కూడా రద్దు చేసేసుకుంటున్నారు.**

**రాజధాని వార్తలు, అమరావతి :** విజయవాడ...ఆంధ్రప్రదేశ్‌లో రియల్టీ రంగానికి అత్యంత ఆకర్షణీయమైన నగరం. రాజధాని నగరం అమరావతికి అత్యంత చేరువలో ఉంది. దేశంలో అన్ని రాష్ట్రాలకు కేంద్రస్థానంగా ఉండడంతో మంచివ్యాపార కేంద్రంగా కూడా ప్రసిద్ధి చెందింది. దేశం నలుమూలలకు తిరిగే రైళ్లలో అధిక శాతం విజయవాడ జంక్షన్ మీదుగానే ప్రయాణిస్తాయి. రాష్ట్ర విభజన అనంతరం కొత్త రాజధాని అన్వేషణలో కూడా విజయవాడ పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. కాని మరింత సువిశాలమైన ప్రాంతంలో రాజధాని నిర్మాణం చేపట్టాలన్న భావనతో అమరావతి ప్రాంతాన్ని అందుకు ఎంపిక చేశారు. రాజధాని అమరావతి అయినా విజయవాడ రియల్టీకి ఢోకా లేదన్న భరోసా ఆ రంగాన్ని ఉరకలెత్తించింది. రాజధాని నిర్మాణం జరిగే వరకు పలు కీలక కార్యాలయాలు విజయవాడలోనే ఏర్పాటు కావడం, అమరావతికి కూతవేటు దూరంలో ఉండంలో విజయవాడ రియల్టీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇన్ని కారణాలతో కొంత కాలం పాటు బిల్డర్లు, డెవలపర్లు,ప్రమోటర్ల సందడి, నిత్య సందర్శకులు, కొను గోలుదార్లతో విజయవాడ రియల్టీ కళకళలాడిపోయింది. **కాని ఇప్పుడు పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రాజెక్టుల భవిష్యత్తుపై రియల్టర్లలో భయాందోళనలు పెరిగిపోయాయి. ఇప్పట్లో మంచి రోజులొస్తా యన్న ఆశలు కూడా ఏ మాత్రం కనిపించకపోవడంతో వారు బెంచేలెత్తిపోతున్నారు.**

**గట్టెక్కిన ప్రాజెక్టులు**

అమరావతి నిర్మాణంలో అశించినంత వేగం లేకపోగా, రాష్ట్రంలో అధికారం చేతులు మారడం వల్ల దాదాపు 2 నెలలుగా నిర్మాణాలు నిలిచిపోయాయి. రియల్టీ రంగం పరుగులు తీయాలంటే మంచి ఉపాధి అవకాశాలుండాలి. పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు ఏర్పడితే వాటి అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. కృష్ణానదీ తీరాన ప్రతిపాదించిన పలు పర్యాటక ప్రాజెక్టులు, గన్నవరం పరిసరాల్లో ఐటీ సంస్థల ఏర్పాటు, వీరపనేనిగూడెం,మల్లవల్లి పారిశ్రామిక వాడల అభివృద్ధి మందకొడిగా జరగడం వంటి కారణాల వల్ల కొన్నేళ్లుగా బెజవాడ పరిసరాల్లో కొత్తగా ఉపాధి అవకాశాలేమీ గణనీయంగా పెరగలేదు. ఇది రియల్టీ రంగానికి శరాఘాతంలా పరిణమించింది.

**ధరలు తగ్గించినా ఫలితం శూన్యం**

వెంచర్లపై లాభాల మాట దేవుడెరుగు..తమ పెట్టుబడి, దానిపై నామమాత్రపు వడ్డీ లభించినా చాలనుకుని పలువురు బిల్డర్లు ధరలను గణనీయంగా తగ్గించి చెబుతున్నా కూడా కొనుగోలుదారులు ముందుకు రావడంలేదు. దింతో వడ్డీలు సైతం గిట్టుబాటవడం లేదని కొందరు, అప్పుగా తెచ్చిన మొత్తాలకు వడ్డీ భారం కొండలా పెరిగిపోతోందని మరి కొందరు వాపోతున్నారు. తాజా పరిస్థితి కారణంగా పలువురు బిల్డర్లు ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టులు పలువురు బిల్డర్లు ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టులు మాత్రం పూర్తి చేసి బతుకు జీవుడా అనుకుంటూ కొత్త ప్రాజెక్టుల జోలికి పోవడంలేదు. బిల్డర్లు, డెవలపర్ల పరిస్థితి ఇలా ఉంటే కొనుగోలుదారులు ధరలు ఇంకా తగ్గుతాయనే ఆశతో నిరీక్షిస్తున్నారు. ధరలు ఇప్పటికే అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని, ఇంకా తగ్గించి అమ్మితే భారీ నష్టాలు పరిశీలకులంటున్నారు.

**డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు రద్దు**

రియల్టీ బూమ్‌లో ఉన్న సమయంలో పలువురు రియల్టర్లు తమ ప్రాజెక్టుల కోసం స్వంతంగా భూములను కొనుగోలు చేయకుండా డెవలప్ మెంట్ ప్రాతిపదికన భూ యజమానులతో అగ్రి మెంట్లు చేసుకున్నారు. పరిస్థితులు అనుకూలిస్తే నిర్మాణాలు ప్రారంభిద్దామని అనుకున్న వారు కూడా పునరాలోచనలో పడ్డారు. మరికొందరు మాత్రం అగ్రిమెంట్లు రద్దు చేసుకుంటున్నారు. విజయవాడ, పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకు సుమారు15 నుంచి 20 డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు రద్దయినట్లు సమాచారం.

**అసలేం జరిగింది...?**

రాజధాని అత్యంత చేరువలో ఉన్నందు వల్ల ఉద్యోగులు, వ్యాపారుల వలసలు అధికంగా ఉంటాయని,స్థిరాస్తులకు మంచి డిమాండ్ ఏర్పడుతుందని భావించి గత నాలుగైదేళ్లలో విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్టర్లు అపార్ట్‌మెంట్,గ్రూప్ హౌస్‌ల నిర్మాణం భారీగా చేపట్టారు. ప్రారంభంలో వారనుకున్నట్టుగానే అవన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. తర్వాత కొద్ది రోజులకే పరిస్థితులు తిరగబడడంతో కొనుగోళ్లు తగ్గుముఖం పట్టడం మొదలైంది. ఆశించినరీతిలో ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు వలస రాకపోవడంతో ప్రాజెక్టుల ప్రమోటర్లకు గడ్డు రోజులు ప్రారంభమయ్యాయి. విజయవాడ, పరిసరాల్లో ప్రతిపాదించిన పలు ప్రాజెక్టుల నిర్మాణం కూడా ఊహించినంత వేగంగా సాగకపోవడం పరిస్థితిని మరింత జటిలం చేసింది. కానీ అప్పటికే చాలా మంది ప్రాజెక్టులు ప్రారంభించేశారు. మొదలు పెట్టిన ప్రాజెక్టులు అర్ధంతరంగా మధ్యలోనే నిలిపివేసే అవకాశం లేకపోవడంతో ఎలాగోలా తంటాలు పడి వాటిని పూర్తి చేస్తున్నారు. రియల్టీ బూమ్‌లో ఉన్నప్పుడు వాకబు చేయడం, బుకింగ్ చేసుకోవడం, పూర్తి కాగానే వాటిలోకి రావడం జోరుగా సాగేది. కాలం గడుస్తున్న కొద్దీ ఎంక్వైరీలు కూడా తగ్గిపోయాయి. దీంతో పలువురు బిల్డర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇబ్రహీం పట్నం, కంకిపాడు, గన్నవరం, నున్న తదితర మార్గాల్లో వందలాది వెంచర్లలోని వేలాది అపార్ట్‌మెంట్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, మరికొన్ని తుది దశల్లో ఉన్నాయని, కాని వాటిని కొనే వారే కరువయ్యారని రియల్టీ వర్గాలంటున్నాయి.

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాల' అమలుకే అగ్రపాధాన్యమిస్తున్నందున ఇప్పట్లో ఇతర రంగాలపై దృష్టి పెడుతుందన్న ఆశలు కూడా కని పించడంలేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఆ లెక్కన చూస్తే మరో ఏడాది కాలం పాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చునన్నది వారి అంచనా. అప్పటికైనా ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం అమ్ముడవకుండా ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇళ్ల స్థలాలు అమ్ముడైతే తప్ప కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కకపోవచ్చునంటున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకునీ, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారావకాశాలు పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## సొంత ఖర్చులతో వైఎస్ జగన్ జెరూసలేం పర్యటన



**రాజధాని వార్తలు, అమరావతి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో జెరూసలేం వెళ్లారు. సోమవారం సాయంత్రం ఆయన హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అక్కడకు చేరుకున్నారు. ఆపుణ్యభూమిని సందర్శించడం వైఎస్ కుటుంబానికి సెంటిమెంట్. ముఖ్యమంత్రిగా తన విదేశీ పర్యటనలను జెరూసలేం నుంచే శ్రీకారం చుట్టడం శుభసూచకంగా భావిస్తున్నారు వైఎస్ జగన్. తన తల్లి విజయమ్మ, భార్య భారతి, సోదరి షర్మిళ, ఆమె భర్త అనిల్ తో పాటు మరికొందరు కుటుంబ సభ్యులతో కలిసి జగన్ జెరూసలేం వెళ్లారు గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సైతం ముఖ్యమంత్రి హోదాలో జెరూసలేంను సందర్శించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఆయన కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి జెరూసలేం వెళ్లొచ్చారు. ఈ సారి ముఖ్యమంత్రి హోదాలో ఆ దేశ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతం. సొంత ఖర్చులతో వైఎస్ జగన్ జెరూసలేం వెళ్లారు. వైఎస్ జగన్ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమే అయినప్పటికీ.. భద్రతా వ్యవహారాల ఖర్చు రూ. 22, 52, 000. ఈ మొత్తాన్ని మంజూరు చేస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి జీవో జారీ చేశారు. ఇజ్రాయిల్‌లో ముఖ్యమంత్రి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తోన్న ట్రిపుల్ ఎస్ టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని జీవోలో పేర్కొన్నారు. డాలర్ల రూపంలో ఆ సంస్థకు ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ప్రొటోకాల్ ప్రకారం.. జగన్ వెంట వ్యక్తిగత సిబ్బందితో పాటు స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీ సెంథిల్ కుమార్, సీఎం వ్యక్తిగత భద్రతా అధికారి జోషి వెళ్లారు.

## ప్లాస్టిక్ నిషేదం : ఫొటో పంపితే రూ.100 పారితోషికం..!



**రాజధాని వార్తలు, విజయవాడ :** జిల్లా యంత్రాంగం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం నడుం బిగించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కృష్ణలంకలోని గీతానగర్‌లో అధికారులు మొక్కలు నాటి జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... 'మన విజయవాడ అనే నినాదంతో ప్లాస్టిక్‌ను తరిమేయాలన్నదే లక్ష్యం. భూసారం తగ్గిపోవడానికి, డ్రైనేజీ సమస్యలకి, పర్యావరణం దెబ్బతినడానికి ప్లాస్టిక్ వ్యర్థాలే కారణం. విజయవాడలో అందరూ చైతన్య వంతులై ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు. ఆ విషయాన్ని ఫొటో తీసి పంపితే వంద రూపాయలు పారితోషికం ఇస్తా'అన్నారు. నగరంలో ఎవరైనా ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ అమ్మినా, వాడినా జరిమానా విధిస్తున్నామని కలెక్టర్ ఇంతియాజ్ వెల్లడించారు. అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్‌పై పూర్తి నిషేదం అమలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇకపై జూట్ బ్యాగుల్లో స్వామి ప్రసాదం



**రాజధాని వార్తలు, తిరుపతి :** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం ఇకపై స్వామి వారి ప్రసాదాన్ని జూట్ బ్యాగుల్లో భక్తులకు అందివ్వాలనుకుంటోంది. ఆగష్టు నెల మూడో వారం నుంచి తిరుమల లడ్డూ వితరణ శాలలో జూట్ బ్యాగ్స్ (జనపనార సంచులు)ను విక్రయించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. తిరుమలలో ప్లాస్టిక్‌ను అరికట్టే చర్యల్లో భాగంగా లడ్డూ కవర్లకు బదులు జూట్ బ్యాగులను అందుబాటులోకి తెస్తామని తెలిపారు.జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీతో సంప్రదించగా గత నెలలో మూడురోజులు 5రూపాయల విలువ చేసే జూట్ బ్యాగులను విక్రయించి భక్తుల నుంచి సలహాలు స్వీకరించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలోనే జూట్‌బ్యాగ్స్ విక్రయాలను ప్రారంభించనుందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు శ్రీనిధి ట్రస్టు ద్వారా రూ.10వేల విరాళం స్వీకరించి విఐపీ బ్రేక్ టికెట్టు ప్రతిపాదనను బోర్డు దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎంపిక చేసిన ఆలయాల్లో మనగుడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. నవంబర్ నెలకు 69,254వేల ఆర్జిత సేవా టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. స్థానిక ఆలయాల్లో సేవా టికెట్ల ఆన్ లైన్ బుకింగ్ కోటా, పరకామణి సేవ, పిలిగ్రిమ్ వెల్ఫేర్ శ్రీవారి సేవలకు స్లాట్‌లను కూడా విడుదల చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. వచ్చేనెల 30న ప్రారంభమయ్యే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఇంజనీరింగ్ పనులు ఇప్పటికే మొదలయ్యాయని అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. గరుడసేవకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం మాడవీధులకు పైకప్పు ఏర్పాట్ల గురించి ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

# 1.39 లక్షల కార్డుల ఏరివేత!

- ఇవన్నీ అర్హత లేవినిగా గుర్తింపు
- ప్రభుత్వ ఉద్యోగులకూ తెల్ల కార్డు
- అలాంటి కార్డులు ఇన్‌యాక్టివ్‌లో సీఎఫ్ ఎంఎస్ ఆధారంగా ప్రక్షాళన
- త్వరలో వాటిని తొలగించే అవకాశం
- అక్టోబరు 2 నాటికి ప్రక్రియ పూర్తి
- ఆ రోజు నుంచే కొత్త పాలసీ అమలు



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆయన 'తెల్లకార్డు' దారుడు! ప్రతినెలా వెళ్లినట్లే... రేషన్ దుకాణానికి వెళ్లాడు. సరుకుల కోసం వేలిముద్ర వేశారు. కానీ... ఎంతగా నొక్కినా నో యూజ్'! 'మీ కార్డు పని చేయడం లేదు' అనే సందేశమే! ఇలా ఒకటీ రెండూ కాదు...రాష్ట్రవ్యాప్తంగా 1.39 లక్షల తెల్లరేషన్ కార్డులు పని చేయడం మానేశాయి. అనర్హులకు జారీ అయినవిగా గుర్తించి... వీటిని 'యాక్టివ్ మోడ్' నుంచి తప్పించారు. అంటే... కార్డు ఉంటుంది. కానీ, సరుకులు తీసుకోవడం సాధ్యం కాదు. అనర్హుల ఏరివేతలో భాగంగా తొలుత 'ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ తెల్లకార్డులు పొందిన వారిపై దృష్టి సారించారు. సీఎఫ్ఎంఎస్ (సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ) ద్వారా వేతనాలు పొందుతున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ... తొలిదశలో ఈ జాబితాలో ఉన్న వారి తెల్లకార్డులను 'ఇన్‌యాక్టివ్'గా మార్చేశారు. ఇలా అర్హత లేకుండా తెల్లకార్డులు కలిగిన వారు ఇంకా ఎవరైనా ఉంటే దశల వారీగా రద్దు చేస్తూ వెళతారు.

**బోగస్ పోయినప్పటికీ..**

ఈ-పోస్ (బయోమెట్రిక్ ద్వారా రేషన్‌పంపిణీ) విధానం వచ్చాక నకిలీ కార్డులు పూర్తిగా తొలగిపోయాయి. కానీ, అర్హత లేనివారు చాలా మంది తెల్లకార్డులు కలిగిఉన్నారనే అనుమానాలు ఉన్నాయి. మొత్తం రేషన్‌కార్డుల వ్యవస్థను ప్రక్షాళన చేయాలు పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత ప్రభుత్వ ఉద్యోగులపై దృష్టిపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగి పేరులో లేకపోయినా వారి కుటుంబంలో ఎవరి పేరుతోనైనా కార్డుకలిగి ఉంటే వాటిపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ఇప్పటిదాకా లక్షకు పైగా కార్డులు తొలగించారు. ఇకపై అర్హత లేని కుటుంబాలకు కార్డులపై డ్రైవ్ చేపట్టనున్నారు.

**జిల్లాకు పది వేలు చొప్పున..**

ఒక్కో జిల్లాలో దాదాపుగా పదివేల కార్డులు తాజా చర్యలతో తొలగించనున్నట్లు తెలిసింది. గతేడాది దరఖాస్తు చేసుకోకపోయినా 52వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కార్డులు జారీచేసి ప్రభుత్వం తప్పులో కాలేసింది. 'అర్హులైతే అడగకపోయినా కార్డులు ఇద్దాం' అనే ప్రజానుకూల నినాదంతో ప్రజాసాధికార సర్వే ఆధారంగా దరఖాస్తు చేసుకోనివారికి కూడా కార్డులు జారీచేసింది. ఇందులో అనేక మంది అర్హులు ఉన్నారు. దాదాపు 60వేల మంది వరకు అనర్హులకూ అప్పట్లో కార్డులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కొందరు న్యాయమూర్తులు, కేంద్రప్రభుత్వ ఉద్యోగులు వీరిలోఉన్నారు. అడగకపోయినా కార్డులు ఇవ్వడంపై అప్పట్లో వారిలో చాలామంది అసంతృప్తి వ్యక్తంచేశారు. తప్పును గుర్తించిన ప్రభుత్వం వెంటనే వారికి కొత్తగా జారీచేసిన కార్డులను రద్దుచేసింది. ఇప్పుడు తొలగించనున్న కార్డులు చాలాకాలం నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేసుకున్నవారందరికీ కార్డులు జారీచేసి సరిగా పరిశీలన చేయలేదంటున్నారు. ఇలాంటి కార్డులను గుర్తించి, ప్రక్షాళన చేయాలు వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది.

**72 గంటల్లోనే కార్డు చేతికి..**

అక్టోబరు 2న గ్రామ సచివాలయాలు ప్రారంభం అయ్యేనాటికి ఏరివేతను పూర్తి చేయాలు పౌర సరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అదే రోజు నుంచి కొత్త కార్డుల జారీకి సరికొత్త విధానం తీసుకొస్తారు. ఎవరైనా కార్డు కావాలు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే కేవలం 72 గంటల్లోనే దాన్ని పరిశీలించి ఈ విధానంలో కార్డు జారీచేస్తారు. ఈ లోగా కార్డుల వడపోతను పూర్తిచేయనున్నారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో ఒక కోటి 47లక్షల తెల్ల కార్డులు ఉన్నాయి. ప్రజాసాధికార సర్వే ప్రకారం రాష్ట్రంలో 1.45కోట్ల కుటుంబాలు ఉంటే అంతకంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉండటం గమనార్హం. అయితే సంఖ్యా పరంగా ఇన్ని కార్డులు ఉన్నా అందులో దాదాపు 20లక్షల మంది కార్డుదారులు సరుకులు తీసుకోవడం లేదు. ప్రభుత్వం పోర్టబులిటీ విధానం తీసుకొచ్చినా 20లక్షల కుటుంబాలు రేషన్‌కు దూరం కావడంపై గతం నుంచీ అనుమానాలు ఉన్నాయి.

# వారికి చుక్కలే..

**రాజధాని వార్తలు, విశాఖపట్నం :** ప్రత్యేక హోదా కోసం విశాఖలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తే అడ్డుకున్నారు. విమానాశ్రమంలో రన్‌వే వద్దకే సాధారణ పోలీసులకు ప్రవేశం లేకపోయినా..నిబంధనలను ఉల్లఘించి జగన్ ను అడ్డుకునేందుకు నాడు అత్యుత్సాహం చూపించారు. ఫలితంగా ఇప్పుడు జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత నాటి ఆ అత్యుత్సాహ అధికారులను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసారు. తమ ప్రభుత్వంలో కక్ష్య సాధింపులు ఉండవని చెబుతూనే ఈ రకంగా వ్యవహరించటం..గోప్యంగా ఉంచటం పైన ఇప్పుడు చర్చ మొదలైంది. నాడు జగన్‌ను అడ్డుకున్నారు.. 2017 జనవరి 26న ఏపీకి ప్రత్యేక హోదా కోసం విశాఖలో వైసీపీ నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసింది. అందులో పాల్గొనేందుకు వైసీపీ అధినేత జగన్ హైదరాబాద్ నుండి విశాఖ చేరుకున్నారు. విమానాశ్రమంలోనే స్థానిక పోలీసులు జగన్‌ను అడ్డుకున్నారు. గణతంత్ర వేడుకల రోజున బీచ్‌రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని చెప్పుకొచ్చారు. విమానాశ్రయం భద్రత కేంద్ర బలగాల ఆధీనంలో ఉంటుంది. టెర్మినల్ బయటకు వచ్చిన తరువాత మాత్రమే స్థానిక పోలీసుల పరిధి మొదలవుతుంది. అయితే, జగన్‌ను నాటి ప్రభుత్వ.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విమానాశ్రయం రన్ వే వద్దనే నిలుపుదల చేసారు. దీనిని నిరసిస్తూ జగన్‌తో పాటుగా వచ్చిన విజయ సాయిరెడ్డి, అంబటి రాంబాబు అక్కడే రన్‌వే మీదనే బైఠాయించారు. నిరసన వ్యక్తం చేసారు. ఇక దశలో పోలీసుల తీరు పైన జగన్ సీరియస్ అయ్యారు. ఆ అధికారులు ఇప్పుడు వీఆర్‌కు నాటి ఘటన సమయంలో విశాఖ పోలీసు కమిషనర్‌గా యోగానంద్ ఉండేవారు. ఇప్పుడు వైసీపీ అధికారంలోకి రావడం.. జగన్ సీఎం కావడంతో.. అప్పట్లో ఆయన్ను విశాఖలో అడ్డుకున్న పోలీసు అధికారులందరినీ వీఆర్‌కు సరెండర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీనిప్రకారం నగర పోలీస్ కమిష నరేట్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఎస్సైలు, ఒక ఏఎస్సైని వీఆర్‌కు పంపుతూ జూలై 27న పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీచేసినట్లు పోలీసు వర్గాల సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు మాత్రం బయటకు రాలేదు. అలాగే ఆ ఘటన జరిగినప్పుడు నగరంలో పనిచేసిన, తాజాగా విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న మరికొంతమంది అధికారులను కూడా వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

## పోలవరం పూర్తి చేసి తీరతాం



**రాజధాని వార్తలు,నెల్లూరు :** పోలవరం ప్రాజెక్టును 2021 నాటికి పూర్తి చేసి తీరతామని జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆపలేదని కేవలం కాంట్రాక్టర్లను మాత్రమే రద్దు చేశామని తెలిపారు. పోలవరంపై కేంద్ర ప్రభుత్వానికి పూర్తి వివరాలు ఇచ్చామని, నూతన కాంట్రాక్టర్లచే నవంబర్ నుంచి పనులు పారదర్శకంగా మొదలవుతాయని పేర్కొన్నారు.పోలవరం ప్రాజెక్టు పనుల్లో జరిగిన అక్రమాలపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం హెడ్‌వర్క్స్(జలాశయం) పనుల నుంచి తప్పుకోవాలని నవయుగ సంస్థకు, గేట్ల తయారీ పనుల నుంచి వైదొలగాలని బీకెమ్ సంస్థకు నోటీసులు జారీ చేయడంతో ఆ కంపెనీలు తప్పుకోవడం తెలిసిందే.

# సెప్టెంబర్ 8న కూడా సచివాలయాల పరీక్ష

- కొన్ని పోస్టులకు ఆ రోజున పరీక్ష నిర్వహించనున్న ప్రభుత్వం
- అర్హతలు ఉన్న అభ్యర్థులు మూడు కేటగిరీల్లోనూ పరీక్ష రాసుకునేలా అవకాశం



**రాజధాని వార్తలు, అమరావతి :** గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు శుభవార్త. అర్హతలు ఉన్నవారు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు పోటీ పడేందుకు వీలుగా కొన్ని పోస్టులకు సెప్టెంబర్ 8న రాత పరీక్ష నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ నియామకాల ప్రక్రియలో విద్యుత్ శాఖ భర్తీ చేసే లైన్‌మెన్ ఉద్యోగాలతో కలిపి మొత్తం 20 రకాల ఉద్యోగాలన్నింటికీ సెప్టెంబర్ 1న రాతపరీక్ష నిర్వహించాలని మొదట ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఒకే అభ్యర్థి రెండు రకాల పోస్టుల పరీక్షలకు హాజరయ్యేలా సెప్టెంబర్ 1న ఉదయం, సాయంత్రం పరీక్షలు పెట్టడానికి నిర్ణయించింది. అయితే, ఇలా కూడా కొందరు అర్హతలు ఉండి కొన్ని పోస్టులకు పరీక్ష రాయడానికి అవకాశం కోల్పోతున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో కొన్ని పోస్టులకు సెప్టెంబర్ 8న ఉదయం, సాయంత్రం పరీక్ష నిర్వహించనున్నామని పురపాలక పరిపాలన శాఖ కమిషనర్ జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాతపరీక్ష తెలుగు, ఇంగ్లిష్‌లో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉద్యోగాన్ని సాధించాలన్న కసితో ప్రిపరేషన్ ప్లాన్ చేసుకుంటున్నారు. మార్కెట్లోకి వెల్లువలా వచ్చిపడిన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు వస్తున్న అభ్యర్థులతో బుక్‌స్టాళ్లు రద్దీగా మారిపోయాయి. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని పుస్తకాల షాపులు యువతీయువకులతో నిత్యం కిటకిటలాడుతున్నాయి..

**కేటగిరీ-1**

1. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5
2. మహిళా పోలీస్, మహిళా శిశు సంక్షేమ అసిస్టెంట్(లేదా) వార్డు మహిళా ప్రొటెక్షన్ సెక్రటరీ
3. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్
4. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ

రాతపరీక్ష: సెప్టెంబర్ 1 ఉదయం

**కేటగిరీ- 2 (గ్రూప్-ఏ)**

1. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2
2. వార్డు ఎమినిటీస్ సెక్రటరీ గ్రేడ్-2 కేటగిరీ-2 (గ్రూప్-బి)
1. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గ్రేడ్-2
2. విలేజ్ సర్వేయర్ గ్రేడ్-3

రాతపరీక్ష : సెప్టెంబర్ 1 సాయంత్రం

**కేటగిరీ-3**

1. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (గ్రేడ్-2)
2. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్
3. విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్
4. డిజిటల్ అసిస్టెంట్ (పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6)
5. పశుసంవర్ధక శాఖ సహాయకుడు
6. ఏఎన్ఎం లేదా వార్డు హెల్త్ సెక్రటరీ (గ్రేడ్-3)
7. విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్

రాతపరీక్ష: సెప్టెంబర్ 1 సాయంత్రం

8. వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్-2)
9. వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ (గ్రేడ్-2)
10. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ

రాత పరీక్ష: సెప్టెంబర్ 8 ఉదయం

11. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ

పరీక్ష: సెప్టెంబర్ 8 సాయంత్రం

# ఆగస్టు సంక్షోభం బీజేపీ నుంచే ఎదురుకానుందా?

**రాజధాని వార్తలు, అమరావతి :** తెలుగుదేశం పార్టీకి ఆగస్ట్ అంటే టెన్షన్. ఆగస్ట్ నెలలో టీడీపీ ఎన్నోన సంక్షోభాలను ఎదుర్కొంది. 1984లో ఎన్టీఆర్‌ను గద్దెదించి నాదెండ్ల భాస్కర్‌రావు సీఎం అయింది ఆగస్ట్ లోనే. ఆ తర్వాత ఎన్టీఆర్‌ను దించి.. చంద్రబాబునాయుడు సీఎం అయింది కూడా ఆగస్ట్ నెలలోనే. తెలుగుదేశం ప్రభుత్వానికి మాయని మచ్చలాంటి బషీర్ బాగ్ కాల్పుల ఘటన కూడా ఆగస్ట్ లోనే జరిగింది. చంద్రబాబు మీద తిరుగుబాటు జెండా ఎగరేసిన హరికృష్ణ సొంతంగా పార్టీ పెట్టారు. ఆ తిరుగుబాటు కూడా ఆగస్ట్‌లోనే జరిగింది. దీంతోపాటు టీడీపీలో ముఖ్యనేత లాల్ జాన్ పాషా కూడా ఆగస్ట్ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. నందమూరి హరి కృష్ణ కూడా ఆగస్ట్ నెలలోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇవన్నీ ప్రధానమైన సంఘటనలు.. ఇంకా మరెన్నో సంక్షోభాలు ఆగస్ట్ నెలలోనే ఎదురయ్యాయి. టీడీపీ క్లిష్టపరిస్థితుల్లో ఉంది. పార్టీ నుంచి నాయకులు ఎప్పుడు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి. ఇప్పటికే నలుగురు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేశారు. ఎమ్మెల్యేలు కూడా పెద్ద ఎత్తున పార్టీ మారతారంటూ ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీజేపీ నుంచి పెద్ద ఎత్తున ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో టీడీపీని ఖాళీ చేయడానికి ప్రణాళికలు చేస్తోంది. మూడింట రెండొంతుల మంది టీడీపీ ఎమ్మెల్యేలకు కాషాయకండువా కప్పుతుందా? దానికి ఈనెలలోనే ముహూర్తం పెడుతుందా? అనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.

# బే ఏరియా లో వైయస్సార్ 70వ జయంతి ఉత్సావాలు









**మిలపీటస్, కాలిఫోర్నియా :** అమెరికాలో ఘనంగా వైయస్సార్ 70 వ జయంతి ఉత్సావాలు జరిగాయి. కాలిఫోర్నియాలోని మిల్పిటాస్ నగరం లోని ఐసీసీ ఆడిటోరియంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించిన ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ (మైలవరం), సినిమా ఆర్టిస్ట్ ప్రిధ్వీరాజ్, డాక్టర్ హనిమిరెడ్డి లక్కిరెడ్డి, జులై 7న జరిగిన ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ కార్యకర్తలు, అనేక మంది మహిళలు కుటుంబ సమేతం గా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో వైయస్సార్సీపీ 151 స్థానాలతో ఘన విజయం సాధించిన సందర్భంగా 350 మందికి పైగా వైయస్సార్సీపీ అభిమానులు, కార్యకర్తలు విజయోత్సవ సభను జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హనిమి రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలను కొనియాడారు. ముఖ్యంగా అమ్మఒడి పథకం, మహిళలకు రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు పదవుల్లోనూ, పనుల్లోనూ సమన్యాయం చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకి వైయస్సార్ తో ఉన్న అనుభవకాన్ని గుర్తుకు చేసుకున్నారు.

ఈ కార్యక్రమాన్నికి వచ్చిన సినిమా ఆర్టిస్ట్ ప్రిథ్వీ రాజ్ ను దుశ్శాలువతో ఉమా కొండూరి సత్కరించారు. రామారావు షీల్డ్ ను బహుకరించారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌ను అబ్దుల్ దుశ్శాలువతో, రామకృష్ణ రెడ్డి షీల్డ్‌ను బహుకరించారు.

ఉమాశంకర్ మరెడ్డి, వీర సురవరం, హనిమి మేరువ, రాజేందర్ చావా, రామనాథ్, వెంకట పులుసు, శంకర్, హరి అగ్రనగు, పార్వతి, లక్ష్మి అల్లా, అంజిరెడ్డి కుడుమ్మాళ్, సీతారెడ్డి గోగులమూడి, శంకర్, నరేష్ కొండూరి, సత్య కొండా, సురేష్ తనమల, అమర్నాథ్ బడే, హరీందర్ శీలం, సురేందేర్ పులగం, ప్రవిణా తదితరులు జయంతి ఉత్సవ కార్యాక్రమాలను నిర్వహించడం లో కీలక పాత్ర పోషించారు.

కార్యక్రమంలో డాక్టర్ రాఘవ, నరేందర్ కొత్తకోట, కరుణాకర్ నీలోతల్, లక్మా రెడ్డి మోర్తాల, శ్రీనివాస్ రెడ్డి అవుతు, రాజేంద్రర్, వర ప్రసాద్, ప్రవీణ్, సుగుణ, బంకా విజయ్ భాస్కర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సుబ్బారెడ్డి అంకిరెడ్డి, జగదీశ్, అనిల్, గాంధీ, లక్ష్మణ్, శ్రీనివాసులు పఘలెటి, ధర్మరాజు, సురేంద్ర, బిందు, ఝూన్సీ, ప్రభాకర్ చాగంటి తదితరులు పాల్గొని సభను జయప్రదం చేసారు.








## రాజధాని క్లాసిఫైడ్స్

ప్రకటనలకు సంప్రదించండి 9440662699

### షాప్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద,
పాత మంగళగిరి,
9848111905

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

**ఇల్లు అమ్మ కం**
గుంటూరు నగరంలోని బొంగరాల బీడు ఏరియా లోని స్వాతి పేట, హౌస్ నెంబర్ : 7-6-132, గుంటూరులో.....140 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు రేకుల ఇల్లు అమ్మ కానికి కలవు. సంప్రదించండి ...99856 58208

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

**సాగర్ బోర్ వెల్స్**
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీర్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683, 9652246869

### హోటల్స్

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

### హస్పటల్స్

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

రాజధాని వార్తలు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల పుస్తకం రానుంది. -9440662699

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

### యూనివర్సిటీ

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్


# 'గుణ 369' మూవీ రివ్యూ



**కథ:**

గద్దలగుంట రాధ(ఆదిత్యమీనన్) పెద్ద రౌడీ. ఒంగోలులో అతని పేరు చెబితే అందరూ భయపడుతుంటారు. అతను సెటిల్‌మెంట్స్ చేసుకుంటూ తనకు ఎదురొచ్చిన వారిని భయపెడుతూ ఉంటాడు. ఒంగోలులో ఓ కుర్రగ్యాంగ్ అక్కడ బీచ్‌లోకి వచ్చే అమ్మాయిలను రేప్ చేసి వీడియోలు తీసి బెదిరిస్తుంటారు. గుణ(కార్తికేయ) ఓ గ్రానైట్ క్వారీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తుంటాడు. అతనికి తల్లిదండ్రులు(నరేష్, హేమ), చెల్లెలు(కౌముది) లోకం. ఓసారి గీత(అనఘ)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారుతుంది. గుణ స్నేహితుడు(మహేశ్)కి తెలిసిన స్నేహితుడు, అతని ఫ్రెండ్స్ అమ్మాయిలను గ్యాంగ్ రేప్ చేసే బ్యాచ్. ఓ సందర్భంలో రాధకు, వారికి గొడవ అవుతుంది. రాధ మనుషులు వారిని చంపేస్తారని భయంతో సెటిల్‌మెంట్ చేయమని గుణని బ్రతిమాలుతారు. రాధతో ఉన్న పరిచయం కారణంగానే కాదు.. వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని రాధను గుణ సెటిల్‌మెంట్‌కు పిలిపిస్తాడు. అయితే ఆ ఫ్రెండ్స్ గ్యాంగ్ రాధను చంపేస్తారు. గుణ జైలుకు వెళ్లి తిరిగొస్తాడు. రాగానే గీత చనిపోయిందని తెలిసి షాక్ అవుతాడు. ఇంతలో రాధ మనుషులు, గుణ మీద, అతని ఫ్యామిలీ మీద ఎటాక్ చేస్తారు. గుణ వారికి బుద్ధి చెబుతాడు. కానీ.. తన కుటుంబాన్ని రాధ మనుషుల నుండి బ్రతికించుకోవాలంటే, రాధను చంపిన హంతకులను పట్టుకోవాలనుకుంటాడు. ఆ క్రమంలో గుణ ఏం చేస్తాడు? అసలు రాధను చంపిందెవరు? గీత మరణానికి కారణం ఎవరు? అనే విషయాలు తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

**విశ్లేషణ :**

నటీనటుల విషయానికి వస్తే... ముందు హీరో కార్తికేయ గురించి చెప్పుకోవాలి. మనింటి అబ్బాయి గుణ అనే కుర్రాడిగా తనదైన నటనతో మెప్పించాడు. ఇక తన ఫిజిక్‌ను కూడా సల్మాన్‌ఖాన్‌లా ఎలివేట్ చేయాల్సిన అవసరం లేకున్నా, రెండు, మూడు సీన్స్‌లో అలాగే చేశాడు. ఇక సెకండాఫ్‌లో యాక్షన్ ఎలిమెంట్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌లో చక్కటి నటనను కనపరిచాడు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో నటన సింప్లీ సూపర్బ్. కమర్షియల్ మాస్ ఎలిమెంట్స్‌తో పాటు.. చివర్లో మంచి మెసేజ్ ఉంది. ఇది కచ్చితంగా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఇక అనఘ తొలి తెలుగు చిత్రంలో ఓ రకంగా చెప్పాలంటే డిఫరెంట్ పాత్రను చేసింది. ఆమె అటెంప్ట్‌కి అభినందించాలి. ఆమె పాత్ర పరంగా తనదైన నటనతో మెప్పించింది. సినిమాలో పిల్లర్‌లాంటి పాత్రలో మహేశ్ నటించాడు. రంగస్థలం తర్వాత అతనికి మంచి పాత్ర ఈ సినిమాలో పడింది. అసలు సినిమా అంతా మహేశ్‌ను బేస్ చేసుకునే రన్ అవుతుంది. ఇక ఆదిత్య మీనన్‌కు పవర్‌ఫుల్ రౌడీ పాత్రలో మెప్పించాడు. ఇక నరేశ్, హేమ, కౌముది, శివాజీరాజా తదితరులు వారి వారి పాత్రల పరిధి మేర చక్కగా నటించారు. ఇక సాంకేతికంగా చూస్తే.. దర్శకుడు అర్జున్ జంధ్యాల గురువు బోయపాటి శ్రీనుగారిలాగానే సినిమాను పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాడు. దర్శకుడు కాస్త లవ్ ట్రాక్‌పై శ్రద్ధ పెట్టి ఉంటే బాగుండేది. నేపథ్య సంగీతం బాగుంది. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించిన పాటల్లో బుజ్జి బుజ్జి బంగారం.. సాంగ్ మినహా ఇతర పాటలు ఆకట్టుకునేలా లేవు. సందర్భానుచితం రెండు, మూడు డైలాగ్స్ బాగున్నాయి. రామ్‌రెడ్డి కెమెరా పనితనం బాగుంది. తమ్మిరాజు ఎడిటింగ్ బాగుంది. ఒకప్పుడు తమిళంలో, తెలుగులో హిట్ అయిన నాపేరుశివను పోలినట్లు కాస్త.., ప్రస్తుత సమాజంలో అమ్మాయిలపై జరిగే అఘాయిత్యాలను బేస్ చేసుకుని కాస్త.. టోటల్‌గా దర్శకుడు సినిమాను మంచి మెసేజ్ ఓరియెంటెడ్‌గా మలిచాడు.



ముఖ్యమంత్రి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ గా పి.పరమేశ్వర రెడ్డి నియామకం..

ప్రస్తుతం నెల్లూరు లో అడ్మిన్ విభాగంలో అడిషనల్ ఎస్పీ గా పనిచేస్తున్న పరమేశ్వర రెడ్డి..

## కాఫీ ఘుమ..ఘుమల

# సిద్ధార్థ అంతర్థానం



**దేశంలో కాఫీ ఘుమ..ఘుమలను వెదజల్లి తాను మాత్రం శాశ్వత ప్రశాంతత వెతుక్కుంటూ వెళ్లిన కెఫే కాఫీ డే సిద్ధార్థ మంచితనం, మానవత్వాన్ని ప్రజలు ఎన్నటికీ మరువరు. 'కాఫీతాగే సమయంలో చాలా జరగొచ్చు' నినాదంతో యువతను ఆకర్షించిన ఆయనలో వ్యాపారవేత్తల లక్షణాల కంటే మానవతా లక్షణాలే ఎక్కువగా ఉన్నాయ. ఏ వ్యాపారంలో అడుగుపెట్టినా.. సమాజిక బాధ్యతను గుర్తుంచుకునే ఆయన లాంటి వారు బహు తక్కువగా ఉంటారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆయన వ్యాపారాన్ని విస్తరించారే తప్ప, సమాజానికి చెందాల్సిన వనరులను, చట్టాల్లోని లొసుగులను, రాజకీయ శక్తులను ఆయన ఎన్నడూ ఉపయోగించుకోలేదు. ఆదాయపు పన్ను శాఖ,సీబీఐ తన మరణానికి కారణమని లేఖలో మాత్రమే రాశారు. అది ముందే మీడియాకు వెల్లడించి ఉంటే ఆయన జీవితం మరో మలుపు తిరిగి ఉండేదేమో.. ఆయన మృదుస్వభావమే..ఆయనను ఆత్మహత్యకు పురిగొల్పింది. దాదాపు 40ఏళ్లపాటు విస్తరించుకుంటూ పోయిన ఆయన వ్యాపార సామ్రాజ్యం తనముందే కుప్పకూలిపోతుందని భయపడే కర్ణాటకలోని నేత్రావతినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన ఎదుర్కొన్న విపత్కర పరిస్థితుల్లో మరో 100 మంది ఉన్నారట..**

గ్రామీణ ప్రాంతాల నుంచి రైతుపిల్లలను తీసుకువచ్చి వారికి నైపుణ్యాలను నేర్పించి ఉద్యోగాలు ఇచ్చి వారిని అభ్యున్నతికి పాల్పడినా ఎన్నడూ పత్రికల్లో ప్రకటనలు, డాబుసరి ఆయన చూపలేదు..నిశ్శబ్దంగా సాయం చేసే ఆయన, అనేక వ్యాపారాలు విస్తరించినప్పటికీ 140 ఏళ్ల నుంచి వారసత్వంగా వచ్చిన కాఫీ తోటల పెంపకాన్ని మాత్రం వదిలిపెట్టలేదు సరికదా మరింత విస్తరింపచేశారుకూడా..కాఫీ బోర్డు కాఫీ గింజలను అంతర్జాతీయంగా కేజీ రూ.30 లకు అమ్ముతూ రైతులకు మాత్రం కేవలం రూ.10లే చెల్లించే రోజుల్లో అప్పటి ప్రధానుల వద్దకు కాఫీ రైతులను తీసుకువెళ్లి బోర్డు ద్వారా కాకుండా డైరెక్టుగా అమ్ముకుని లాభాలు ఆర్జించేంచే అవకాశం కలిగించారు.

సరళీకృత ఆర్థిక విధానాలను దేశంలో అమలు పరచాలని నేతలు భావిస్తున్న వేళ అంది వచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు.

కర్ణాటకలోని చిక్కమగళూరులో కాఫీ తోటల యజమానుల కుటుంబంలో జన్మించిన సిద్ధార్థ , 1980ల్లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. కొంత కాలానికే స్టాక్ మార్కెట్లలో సొంతంగా పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టారు. భారత్‌లో 1991 ఆర్థిక సంస్కరణలతో కాఫీ వ్యాపారంపై పరిమితులు తొలగించాక, సిద్ధార్థకు తొలిసారిగా గొప్ప అవకాశం లభించింది. ఇది 1993లో కాఫీ గింజల వ్యాపారాన్ని ప్రారంభించేందుకు దోహదం చేసింది. రెండేళ్లలోనే ఆయన కంపెనీ భారత్ నుంచి కాఫీ ఎగుమతిచేసే అతిపెద్ద సంస్థల్లో ఒకటిగా అవతరించింది.

పాశ్చాత్య దేశాల్లో 'కెఫే సంస్కృతి' నుంచి స్ఫూర్తి పొందిన సిద్ధార్థకు, భారత్‌లో కూడా కాఫీ చైన్ వ్యాపారాన్ని ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. టీకి ఎక్కువగా అలవాటుపడ్డ దేశంలో కాఫీని కోరుకొనేవారు చాలా తక్కువ మంది ఉంటారని, కాబట్టి ఈ ఆలోచనను విరమించుకోవాలని ఆయన సహచరులు సూచించారు. కాని సిద్ధార్థ వెనక్కు తగ్గలేదు. జర్మనీ కాఫీ చైన్ చిబో యజమానులతో ఆయన జరిపిన సంభాషణ తన ఆలోచనను ఆచరణలో పెట్టేలా చేసింది. 'ఎ లాట్ కెన్ హ్యాపెన్ ఓవర్ కాఫీ' అనే స్లోగన్‌తో 1996లో బెంగళూరులోని ఓ సంపన్న ప్రాంతంలో తొలి 'కెఫే కాఫీ డే' (సీసీడీ) ఔట్‌లెట్‌ను సిద్ధార్థ ప్రారంభించారు. సీసీడీ యువతను వెంటనే విశేషంగా ఆకట్టుకొంది. విద్యార్థులు, 30 ఏళ్లలోపు కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు అక్కడ కాఫీ తాగుతూ గంటలకొద్దీ గడిపేవారు. 1990ల్లో, 2000ల్లో సీసీడీలకు ఆదరణ అంతకంతకూ పెరిగిపోయింది. సీసీడీ తన తొలి అంతర్జాతీయ ఔట్‌లెట్‌ను 2005లో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ప్రారంభించింది. 2011 నాటికి వెయ్యికి పైగా ఔట్‌లెట్లను ఏర్పాటు చేసింది.

అమెరికా కాఫీ కంపెనీ 'స్టార్‌బక్స్'కు సుదీర్ఘకాలం సీఈవోగా వ్యవహరించిన హొవర్డ్ షుల్జ్‌తో కాఫీడే సిద్ధార్థను పోలుస్తారు. అంతర్జాతీయ దిగ్గజ బ్రాండ్‌గా స్టార్‌బక్స్‌ను తీర్చిదిద్దడంలో హొవర్డ్ కీలకపాత్ర పోషించారు.

**హరీష్ బిజూర్**
**బెంగళూరు బ్రాండ్ కన్సల్టెంట్**

"సిద్ధార్థ భారత్‌లో కాఫీ వినియోగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఆయన నిస్సందేహంగా కాఫీ కింగ్. ఇందులో రెండో మాటకు తావులేదు" అని హరీష్ బిజూర్ చెప్పారు. అందుబాటులో ధరలు, మంచి వాతావరణం, నాణ్యమైన సేవలు అనే వ్యాపారం మూడు సూత్రాలు ప్రాతిపదికగా సీసీడీ సాగుతోందన్నారు. వినియోగదారులందరూ ఒకేలా ఉండరు. ఆయా వర్గాల అవసరాలకు తగినట్లుగా భిన్నమైన నమూనాల్లో స్టోర్లను ఏర్పాటు చేస్తూ, సీసీడీ వ్యాపారాన్ని వృద్ధి చేసుకొంటూ వచ్చారు. కాఫీకి రూ.70 నుంచి రూ.100 మించి పెట్టలేని యువతను సీసీడీ ప్రధాన లక్ష్యంగా చేసుకొంది. అలాగే, అదనపు సేవల కోసం మరింత డబ్బు చెల్లించేందుకు సిద్ధంగా ఉండే ప్రీమియం వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని లాంజ్-తరహా స్టోర్లను తెరిచింది. వీటిలో వైఫై ఉచితం. పాత రోజుల్లో వైఫై ఇలా ఇవ్వడం చాలా అరుదు. కాఫీతోపాటు ఇంటర్నెట్ ఇవ్వడం అప్పట్లో అసాధారణమైన కాంబినేషన్" అని హరీష్ బిజూర్ వ్యాఖ్యానించారు. పస్తుతం వియన్నా, చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రాగ్, మలేషియా రాజధాని కౌలాలంపూర్ సహా 200కి పైగా నగరాల్లో 1,700కు పైగా సీసీడీ స్టోర్లు ఉన్నాయి.

**కొత్త ప్రత్యర్థులు**

దాదాపు ఎలాంటి పోటీ లేకుండా దశాబ్దానికి పైగా వ్యాపారం సాగించిన సీసీడీకి- స్టార్‌బక్స్, కోస్తా కాఫీ, ఇతర అంతర్జాతీయ బ్రాండ్ల ప్రవేశంతో తొలిసారిగా 2012లో గట్టి పోటీ ఎదురైంది. తీవ్రమైన పోటీ కారణంగా సీసీడీ తన విస్తరణ వేగాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

2015లో మరిన్ని నిధుల కోసం- భారత స్టాక్‌మార్కెట్లో కంపెనీని 'లిస్టింగ్' చేయించారు. మదుపర్ల




నుంచి ఆశించిన స్పందన రాలేదు. ట్రేడింగ్ మొదటి రోజే కంపెనీ షేరు ధర 18 శాతం పడిపోయింది. ఆ తర్వాత నష్టాలు తగ్గించుకొనేందుకు లాభదాయకంగా లేని స్టోర్లను సీసీడీ మూసివేయడం మొదలుపెట్టింది.

**వృద్ధిని వెంటాడిన రుణభారం**

పెరుగుతున్న రుణభారం సంస్థ వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతూనే ఉంది. 2019 మార్చి 31లో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి సీసీడీ రుణాలు వంద కోట్ల డాలర్లకు దగ్గరగా ఉన్నాయి. అప్పులు తగ్గించుకొనే ప్రయత్నాల్లో భాగంగా ఈ ఏడాది భారత సాఫ్ట్‌వేర్ సంస్థ 'మైండ్‌ట్రీ'లో తన 20.41 శాతం వాటాను 45 కోట్ల డాలర్లకు పైగా విలువకు సిద్ధార్థ అమ్మేశారు. రుణభారాన్ని తగ్గించుకొనేందుకు సీసీడీలో తన వాటాను కొంత అమ్మేసేందుకు కోకాకోలా, ఇతర సంస్థలతో సిద్ధార్థ చర్చలు జరిపారనే వార్తలు వచ్చాయి. వీటిని సిద్ధార్థగాని, కోకాకోలాగాని ఎన్నడూ నిర్ధరించలేదు. సీసీడీ 2019 మార్చిలో 1,814 కోట్ల రూపాయల ఆదాయం లెక్క చూపింది. మైండ్ ట్రీ కన్సల్టింగ్‌లో సిద్ధార్థ తన వాటాను గత ఏడాది ఎల్ అండ్ టీకి విక్రయించిన తర్వాత.. 2,858 కోట్ల రూపాయలు లాభంగా నివేదించారు. 2017లో ఆయన అధికారిక నివాసాల్లో ఆదాయ పన్ను విభాగం సోదాలు జరిపింది. అప్పటి నుంచే ఆయనకు కష్టాలు ప్రారంభం అయ్యాయి.

2018 జనవరిలో సీసీడీ షేరు ధర ముందెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరింది. అప్పుడు మార్కెట్ కాపిటలైజేషన్ వంద కోట్ల డాలర్లకు పైనే ఉంది. కానీ ఆ తర్వాత షేర్ల విలువ బాగా పడిపోయింది.

గత మంగళవారం సిద్ధార్థ అదృశ్యం, ఆపై మరణం తర్వాత షేర్లు దారుణంగా పడిపోయాయి. సవాళ్లున్నప్పటికీ, సరైన నిర్వహణ ఉంటే గొప్ప భవిష్యత్తున్న మంచి బ్రాండ్ సీసీడీ అని విశ్లేషకులు చెబుతారు. అందువల్లే సిద్ధార్థ మరణం భారత వ్యాపార రంగానికి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. అసలు ఏం జరిగిందనేదానిపై కొంత సమాచారం సీసీడీ బోర్డుకు సిద్ధార్థ రాసిన లేఖలో పేర్కొన్నారు. **శక్తివంచన లేకుండా ప్రయత్నించినప్పటికీ సరైన లాభదాయక వ్యాపార నమూనాను తాను తీర్చిదిద్దలేకపోయానని తన లేఖలో ఆయన విచారం వ్యక్తంచేశారు. తాను అప్పుల్లో ఉన్నానని, అన్ని పొరపాట్లకూ తానే బాధ్యుడినని, వ్యాపారవేత్తగా విఫలమయ్యానని ఆయన ఆవేదన చెందారు. ఆదాయపు పన్ను శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ ఒకరు తనను వేధించారని, ఫలితంగా ద్రవ్య లభ్యతలో తీవ్రమైన సమస్యలు ఉత్పన్నమయ్యాయని సిద్ధార్థ ఆరోపించారు.** ఈ లేఖ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యింది. ఇది సిద్ధార్థదేనని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇతరులు దీనిపై సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. సిద్ధార్థ మరణం నేపథ్యంలో ఆర్థిక అంశాలపై రాజకీయ దుమారం రేగుతోంది. మరోవైపు సంబంధీకులందరూ తమకు అండగా నిలవగాలని సీసీడీ కోరుతోంది. వ్యాపారం కొనసాగుతుందని భరోసా ఇస్తోంది.

**సీసీడీ అంటే కాఫీ మాత్రమే కాదు...**

స్టైలిష్‌గా డిజైన్ చేసిన కెఫేలలో కాఫీని విక్రయించటం ద్వారా.. టీ తాగే భారతదేశపు ప్రజలను ముఖ్యంగా యువతను కాఫీ ప్రియులుగా మార్చారాయన. ప్రధానంగా దక్షిణ భారత రెస్టారెంట్లలో విక్రయించే కాఫీతో పోలిస్తే.. కెఫే కాఫీ డే (సీసీడీ)ని భారతదేశంలోని అతి పెద్ద బ్రాండ్లలో ఒకటిగా మార్చారు సిద్ధార్థ. స్టార్ బక్స్ వంటి ప్రత్యర్థుల ప్రవేశాన్ని తిప్పికొడుతూ.. వివిధ నగరాల్లో ప్రైమ్ లొకేషన్లలో కెఫేలను ఏర్పాటుచేశారు. దేశంలో కాఫీ వినియోగాన్ని పెంచటం.. నిలకడలేని అంతర్జాతీయ మార్కెట్ ఎగుమతుల మీద పూర్తిగా ఆధారపడిన చిన్న, అల్పాదాయ కాఫీ ఉత్పత్తిదారులకు ప్రత్యామ్నాయం కల్పించి ప్రోత్సహించటం ఆయన చేసిన అతిపెద్ద కృషి.

**ఎస్.ఎం.కావేరప్ప**
**కాఫీ బోర్డ్ మాజీ వైస్ చైర్మన్**

"ఇండియాలో దేశీయ కాఫీ వినియోగం పెరగటానికి కారణం ఆయన ఒక్కరే. అందులో సందేహం అవసరం లేదు. ఆ రోజుల్లో మేం పూర్తిగా ఎగుమతి మార్కెట్ మీద ఆధారపడి ఉన్నాం. కాఫీ విక్రయం మీద భారీ నియంత్రణలు ఉండేవి".

**ఎంబీ దేవయ్య**
**కాఫీ గ్రోయర్స్ కార్పొరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు**

'కొన్నేళ్ల కిందట నేను వైష్ణోదేవి మందిరానికి వెళ్లినపుడు అక్కడ ఐదు రూపాయలకు కాఫీ తాగగలిగాను" అనికొడగు కాఫీ గ్రోయర్స్ కార్పొరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎంబీ దేవయ్య చెప్పారు. 2001లో సిద్ధార్థ పాత వ్యాపార సహచరుడు నరేష్ మల్హోత్రా ఈ కాఫీ వ్యాపారంలో ఆయనతో జతకట్టారు. వారిద్దరూ కలిసి దేశమంతటా సీసీడీ ఔట్‌లెట్లు తెరిచారు. "అమృత్‌సర్ వాసులు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో టీ బదులు కాఫీ తాగాలని మల్హోత్రా కోరుకున్నారు" అని సిద్ధార్థ ఒకసారి నాతో చెప్పారని దేవయ్య వెల్లడించారు. ఇప్పుడు సమాజంలోని అనేక వర్గాల వారికి సీసీడీలు మీటింగ్ పాయింట్లుగా మారాయి. దేశవ్యాప్తంగా 1,700 పైగా ఉన్న ఈ ఔట్‌లెట్లు.. యువ ప్రొఫెషనల్స్ సమావేశాలు మొదలుకుని పెళ్లిచూపుల కయికల వరకూ.. పని చేసుకునే ప్రదేశాలుగా కూడా ఉపయోగపడుతున్నాయి."కాఫీ పెంపకందార్లకు ఇంత మేలు చేసిన సిద్ధార్థ వంటి వ్యక్తి ఎందుకు కుంగిపోతాడు" అని దేవయ్య ప్రశ్నించారు.

**పేరు తెలపని జర్నలిస్ట్**

ఆయన కార్పొరేట్ ప్రపంచంలోని ఇతరుల తరహాలో ఉండరు. తన బంధువులను, శతాబ్దానికి పైగా కొనసాగిన తమ కాఫీ ఎస్టేట్ ఉన్న తన గ్రామ ప్రజలను, రైతులను నిరంతరం కలుస్తుండేవారు" అని కాఫీ ఎస్టేట్ కుటుంబానికే చెందిన ఒక జర్నలిస్ట్ తెలిపారు.

**అనిల్ కుమార్ భండారి**
**ఇండియా కాఫీ ట్రస్ అధ్యక్షుడు**

యువకుడిగా ఉన్నప్పటి నుంచి ఆయనదృష్టి వ్యాపారాలపై ఉండేది. ఆయన ఏది చేసినా సామాజిక బాధ్యతతో చేసేవారు. దేశంలో కాఫీకి బాటలు పరిచింది ఆయనే.. డిసెంబరులో బెంగళూరులో ప్రపంచ కాఫీ సదస్సు ఏర్పాట్లు జరుగుతున్నసమయంలో ఆయన మృతి చెందడం తీరని విషాదం.

**జెఫ్రి రెబల్లో**
**ఉపాసి కాఫీ కమిటీ చైర్మన్**

స్వార్థం ఎరుగని ఇలాంటి వ్యాపారులను చూడటం చాలా కష్టం. ఆయన తన చుట్టు ఉన్న అందరికోసం కృషి చేశారు. ఆయన తన పనివారందరినీ నవ్వుతూ పలకరించేవారు..

**రమేష్ రాజా**

కాఫీ ఎగుమతిదార్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆయన లేని లోటు తీర్చలేనిది.. ఆయన ప్రజల మనిషి.. మల్నాడులో 50 వేల మంది కాఫీ తోటల రైతుల జీవితాలు ఆయనతో పెనవేసుకున్నాయి.

**డాక్టర్. అంశుమంత్**

కాఫీ రైతుల కోసం చిక్ మంగుళూరులో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించి ఉచిత సేవలు అందించాలని ఆయన ఎంతగానో కోరుకున్నారు.

**రోహిత్ రాజ్‌గోపాల్**
**కాఫీ రైతు**

అన్న విఫల వ్యాపారిని అంటూ వ్యధచెందాడు.. కాని కాఫీ ప్రపంచానికి మాత్రం ఆయన రారాజు..ఆయన ఒక దార్శినికుడు.. విజయసారధి..మర్గదర్శి కూడా..

**ఎంబీ గణపతి**
**చైర్మన్ కర్ణాటక కాఫీ మొక్కల అసోసియేషన్**

భారత కాఫీ పానీయం ఉత్పత్తులున్నంత వరకు ఆయన గుర్తుండిపోతారు.

**ఆనంద్ మహీంద్రా ట్వీట్**

**'నాకు సిద్ధార్థ గురించి తెలియదు.. ఆయన ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో కూడా తెలీదు. కానీ నాకు తెలిసిందల్లా పారిశ్రామికవేత్తలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా వ్యాపారంలో వచ్చిన నష్టాలను ఎదుర్కోవాలి. తమ ఆత్మ గౌరవాన్ని నాశనం చేసే అవకాశం ఇవ్వొద్దు. ఇది పారిశ్రామిక రంగం అంతానికి దారి తీస్తుంది.'**

– ఖాన్

# అమర్‌నాథ్ యాత్ర అర్థాంతరంగా నిలిపివేత



- కశ్మీర్‌లో హై అలర్ట్!
- యాత్రపై పాకిస్తాన్ 'ఉగ్ర' దృష్టి
- పాక్‌లో తయారైన మందుపాతర లభ్యం
- అమెరికాలో తయారైన స్నైపర్ తుపాకీ కూడా

కశ్మీరం వేడెక్కుతోంది. లోయలో భద్రతా బలగాల పెంపుపై ఊహాగానాలు కొనసాగుతుండగానే.. ప్రతిష్టాత్మక అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తూ శుక్రవారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాత్రపై పాక్ ఉగ్రదాడికి పాల్పడే అవకాశముందనే నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రీకులు, ఇతర పర్యాటకులు తక్షణమే తమ పర్యటనను ముగించుకుని కశ్మీర్ నుంచి వెనక్కు వెళ్లాలని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఆదేశించింది. యాత్ర మార్గంలో పాకిస్తాన్‌లో తయారైన మందుపాతర, అమెరికా మేడ్ స్నైపర్ రైఫిల్ లభించాయని భారత ఆర్మీ ప్రకటించింది.

యాత్రపై దాడికి ఉగ్రవాదులు కుట్ర పన్నుతున్నారని కచ్చితమైన నిఘా సమాచారం వచ్చినట్లు పేర్కొంది. కశ్మీర్‌కు భారీగా బలగాలను పంపిస్తున్నారన్న వార్తలు స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. అయితే, అలాంటిదేమీ లేదనీ, అంతర్గత భద్రత, సిబ్బంది మార్పిడి కోసం 10 వేల మందిని పంపేందుకు గత వారమే ఆదేశాలిచ్చామని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడి ప్రజల కన్నా.. భూభాగమే ముఖ్యమని తేలిందని పీడీపీ నేత, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు.

**శ్రీనగర్:** అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం అనూహ్య ప్రకటన చేసింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్ర లక్ష్యంగా దాడి చేసేందుకు ఆ దేశ ఆర్మీ సహాయంతో కుట్రలు పన్నుతున్నారని కచ్చితమైన సమాచారం వచ్చినట్లు భారత ఆర్మీ శుక్రవారం హెచ్చరించింది. దీంతో యాత్రికులు, పర్యాటకులు కశ్మీర్ నుంచి ఉన్నపళంగా వెనక్కు వెళ్లిపోవాలని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం సూచించింది. దీంతో స్థానిక కశ్మీర్ ప్రజల్లోనూ భయాందోళనలు నెలకొన్నాయి.

పరిస్థితులు హింసాత్మకంగా మారే అవకాశం ఉందంటూ అక్కడి ప్రజలు నిత్యావసరాల కొనుగోలుకు దుకాణాల ముందు క్యూలు కడుతున్నారు. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో గవర్నర్ పాలన నడుస్తుండటం తెలిసిందే. జూలై 1న మొదలైన అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 15న ముగియాల్సి ఉంది. కాగా, యాత్ర సాగే మార్గాల్లో ఆయుధాలు, పేలుడు పదార్థాలను సైన్యం గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుందని ఆర్మీ 15 కార్ప్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీవోసీ) లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ చెప్పారు.

అమర్‌నాథ్ యాత్ర సాగే బల్తాల్, పహల్గామ్ మార్గాల్లో భద్రతా దళాలు సోదాలు నిర్వహించగా, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు, అమెరికాలో తయారైన ఎం-24 (స్నైపర్) తుపాకి లభించాయని వెల్లడించారు. పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశామని ఆయన



తెలిపారు. యాత్రికులపై దాడి చేయాలన్న ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేసేందుకు భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని ధిల్లాన్ వెల్లడించారు. గత కొన్ని రోజుల్లో భద్రతా దళాలు జరిపిన సోదాల్లో, పాకిస్తాన్‌లోని ఆయుధ కర్మాగారంలో తయారైన మందుపాతర, భారీ స్థాయిలో ఇతర ఆయుధాలు దొరికాయని ధిల్లాన్ తెలిపారు. కశ్మీర్ లోయలో శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టేందుకు పాకిస్తాన్, ఆ దేశ ఆర్మీ చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. జమ్మూ కశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్‌తో కలిసి ధిల్లాన్ సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'గత మూడు నాలుగు రోజుల నుంచి మాకు నిఘా వర్గాల ద్వారా కచ్చితమైన సమాచారం వస్తోంది. పాకిస్తాన్ ఆర్మీ నేతృత్వం, సాయంతోనే ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్రికులపై దాడి చేసేందుకు కుట్ర పన్నుతున్నారు' అని చెప్పారు. మరోవైపు అవసరమైతే కశ్మీర్ విమానాశ్రయం నుంచి అదనపు విమానాలను నడపడానికి సిద్ధంగా ఉండాలని విమానయాన సంస్థలను డీజీసీఏ ఆదేశించింది.

## పుకార్లు నమ్మొద్దు : కాశ్మీర్ గవర్నర్

**రాజధాని వార్తలు, శ్రీనగర్ :** జమ్మూకాశ్మీర్‌కి భారీ ఎత్తున కేంద్ర బలగాలు పంపడంతో అక్కడి రాజకీయ పార్టీల్లో టెన్షన్ మొదలైంది. కాశ్మీర్‌లో కొంపలు మునిగిపోయే పరిస్థితులు ఏవీ లేవనీ, కేంద్ర ప్రభుత్వం అనవసరంగా హడావుడి చేస్తోందని స్థానిక పార్టీలు గగ్గోలు పెడుతున్నాయని, అదే సమయంలో... అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రవాదుల ముప్పు ఉందన్న కేంద్రం... వెంటనే వెనక్కి వచ్చేయాలని యాత్రికులను కోరడం కూడా ఉద్రిక్తతను మరింత పెంచింది. దానికి తోడు... ఇప్పటికే ఇటీవల 10వేల కేంద్ర బలగాలు కాశ్మీర్ చేరగా... మరో 25వేల మంది త్వరలో రాబోతున్నారు. ఇంత మందిని ఎందుకు తెస్తున్నారు, కేంద్రం ఏం చెయ్యబోతోంది అంటూ... స్థానిక పార్టీల నేతలంతా ఒక్కటై... గవర్నర్ శ్రీ సత్యపాల్ మాలిక్‌ను కలిశారు. కాశ్మీర్ లోయలో ఏదో జరుగుతోందనీ, అసలెందుకు కేంద్రం ఇన్ని బలగాల్ని మోహరిస్తున్నాయో తమకు కేంద్రం చెప్పాలని గవర్నర్‌ను కోరారు.. అమర్‌నాథ్ యాత్రికులపై దాడులు చేసేందుకు ఉగ్రవాదులు కుట్రలు పన్నినట్లు, భక్తుల మధ్య యాత్రికుల్లా కలిసిపోయి... దాడులు చేసేందుకు టెర్రరిస్టులు సిద్ధమవుతున్నట్లు కచ్చితమైన ఆధారాలు ఉన్నాయన్న గవర్నర్... అందుకే యాత్రికుల్ని వెనక్కి వచ్చేయమని కేంద్రం ఆదేశించిందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఉగ్రవాదులు వాడుతున్న కొన్ని ఆయుధాలు కూడా లభించాయన్న విషయాన్ని తెలిపారు. కేంద్రం ప్రకటనపై టెన్షన్ పడాల్సిన పనిలేదన్న గవర్నర్... జరిగే పరిణామాల్ని అలా చూస్తూ ఉండమన్నారు. పుకార్లు నమ్మవద్దనీ... ఎలాంటి ఆందోళనా చెందవద్దని పార్టీల ప్రతినిధులకు సూచించారు. తాము అధికారంలోకి వస్తే, జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 35ఎ ఆర్టికల్ 370ని రద్దుచేస్తామని లోక్ సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ ప్రకటించింది.

**కాశ్మీర్‌కు మరో 25 కంపెనీల బలగాలు..!**

జమ్మూ కాశ్మీర్‌లో ఏం జరుగబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. గత వారం 10వేల మంది భద్రతా సిబ్బందిని లోయకు పంపిన కేంద్రం.. తాజాగా మరిన్ని బలగాలను మోహరించింది. కాశ్మీర్ లోయలో 250 కంపెనీల పారామిలటరీ బలగాలు మోహరించాయి. దీంతో లోయలో ఏం జరుగుతుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. కాశ్మీర్ లోయలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పారామిలటరీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భద్రతా బలగాల్లో ఎక్కువ మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ఉన్నారు. శ్రీనగర్‌ను సెక్యూరిటీ సిబ్బంధి తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. వారితో పాటు స్థానిక పోలీసులు సైతం విధులు నిర్వహిస్తున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com